ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ చర్యలు కరువు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ



తాంసిలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



జామిడిలో ఇళ్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. కనీసం చుట్టూ కంచె కూడా లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు అందోళన చెందుతున్నారు. తరుచూగా పశువులు మృత్యువాత పడుతున్నారు. రోడ్డు పక్కన, ఇళ్ల మధ్య తక్కువ ఎత్తులో ఉండడంతో, కంచె ఏర్పాటు చేయకుండా అలాగే వదిలి వేయడంతో ప్రమాదం పొంచి ఉంది.

జనావాసాల్లోనే అధికంగా..

మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్య, పాఠశాలల సమీపంలో ఉండడంతో ప్రజలు అందోళన చెందుతున్నారు. తాంసి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో పాఠశాల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. గత నెలలో ఇక్కడే విద్యుత్‌షాక్ గురై మేక మృతి చెందింది. నిత్యం విద్యార్థులు తిరిగే ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్ కంచె లేకుండా ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. భీంపూర్ మండలంలోని అర్లి(టి), కరంజి(టి), ఇందిరానగర్ గ్రామాల్లో ఎలాంటి భద్రత లేకుండా ఉన్నాయి.

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం..

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన సమయంలో చుట్టూ కంచె ఏర్పాటు చేయాల్సిన బాధ్యత విద్యుత్‌శాఖ అధికారులపై ఉంది. కానీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా.. చర్యలు తీసుకోవడంలో అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారు. సమస్యలను విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదనని అంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మేక మృతి చెందింది



ట్రాన్స్‌ఫార్మన్ వద్ద విద్యుత్‌షాక్ గురై రూ.10 వేల విలువ గల మేక జూన్‌లో మృతి చెందింది. గ్రామ సమీపంలోని పాఠశాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచే లేకుండా రోడ్డుకు దగ్గర ఉంది. పశు గ్రాసం తింటూ వెళ్లిన జీవాలు మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– గొడ్డెల రాజు, తాంసి

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని ఆయా గ్రామాల్లో కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఇదివరకే గుర్తించాం. ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ కంచె ఏర్పాటు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదనలు సైతం చేశాం. నిధులు మంజూరు కాగానే భద్రత చర్యలు తీసుకుంటాం.

– మనోజ్ కుమార్, ఏఈ విద్యుత్‌శాఖ

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ పథకాలు, రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మావల మండలంలోని బట్టి సావర్‌గాం గ్రామంలో పీఎంఎఫ్‌ఈ కోల్డ్ ప్రెస్ అయిల్ మిల్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సొసైటీ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించే దిశగా ఇలాంటి పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, జెడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్, భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్, డీపీఎం సుగంధ, ఏపీఎం శేఖర్, దర్శనాల రమ్య రేఖ, ఆర్గానిక్ మేనేజర్ దర్శనాల సతీష్, దాసరి రమేశ్ పాల్గొన్నారు.



అయిల్ మిషన్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ముదిరాజ్ ఆదిలాబాద్ పట్టణ కార్యవర్గ సభ్యులు సోమవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాము, సభ్యులు రవి, సంతోష్, పొచ్చన్న, శివ, గణేష్, కృష్ణ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన కరపత్రాలు విడుదల

ఆదిలాబాద్‌టౌన్: సంకటమోచన హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కరపత్రాలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిశారు. సెప్టెంబర్ 2, 3, 4 తేదీల్లో ఆదిలాబాద్ పట్టణంలోని ఆదిత్యనగర్ కాలనీలో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు ఇజ్జిగిరి నారాయణ, గోవర్ధన్, పవన్ నాయక్, దశరథ్, దత్తు, పుండలిక్, వంశీ పాల్గొన్నారు.

అన్నాభావుసాఠేకు ఘన నివాళి

ఇంద్రవెల్లి: బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేసిన అన్నాభావు సాఠే ఆశయ సాధన కోసం కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేసిన అన్నాభావు సాఠే జయంతి వేడుకల్లో పాల్గొని, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్, ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, రితేష్ రాథోడ్, మహారాష్ట్ర (చంద్రపూర్)కు చెందిన గజానంద్‌మావులి మహారాజ్, పీఏసీఎస్ చైర్మన్ డోంగ్రె మారుతి, మహ్మద్ అంజద్, మీర్జా జీలానిబేగ్, శ్రీరాంనాయక్, కాంబ్లే బాలరాజ్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ఆర్థిక సాయం అందిస్తాం

ఆదిలాబాద్‌టౌన్: చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ఆర్థిక సాయం అందిస్తామని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషన్ రాజు అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో చిన్న, పరిశ్రమల కోసం దరఖాస్తులు చేసుకున్న వారితో సమావేశం నిర్వహించారు. పరిశ్రమల ఏర్పాటుతో వచ్చే లభ, నష్టాల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతంలో తయారీ పరిశ్రమ కింద రూ. 50 లక్షల రుణానికి 35 శాతం సబ్సిడీ, సర్వీస్ సెక్టర్ కింద రూ. 20 లక్షల రుణానికి 35 శాతం సబ్సిడీ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమల శాఖ సూపరింటెండెంట్ సత్యానారాయణ, ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రిసోర్స్ పర్సన్ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: సద్గురు పూలాజీబాబా జయంతి సందర్భంగా కుమురం భీం జిల్లా జైనూర్ మండలంలోని పట్నాపూర్‌లో ఈనెల 29న నిర్వహించే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంద్ ఆదివాసీ సేవ సమితి జిల్లా అధ్యక్షుడు ముఖడే విష్ణు అన్నారు. సోమవారం మండలంలోని అంజీ గ్రామంలో పూలాజీబాబా జయంతి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాధవ్, దశరథ్, జైరాం, డిగంబర్, సంతోష్, శ్యామ్‌రావ్, శంకర్, గజానంద్, పర్సురాం, బాబారావ్ పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోను సన్మానించిన సర్పంచ్‌లు

తాంసి: భీంపూర్ మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు సోమవారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ని ఉట్నూర్‌లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని మూడు గ్రామ పంచాయతీలను పీఎం ఏఏజీవైకి ఎంపిక చేయడంపై పీవోను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మడావి లింబాజీ, కృష్ణ యాదవ్, రూప శంకర్ పాల్గొన్నారు.

హెచ్‌డబ్ల్యూవోపై చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం: ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలో ఎస్సీ బాలికలను చిన్న చూపు చూస్తూ అవహేళన చేసిన హాస్టల్ వెల్ఫేర్ అధికారి గంగాదేవిపై చర్యలు తీసుకోవాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

బజార్‌హత్నూర్: మండలంలోని చింతలసాంగ్వీ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన విద్యార్థిని సిడం ప్రవళిక నీట్‌లో ప్రతిభ కనబరిచి ఖమ్మం మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. సోమవారం ఆమె చదువు ఖర్చు నిమిత్తం ఆదివాసీ గిరిజన పోలీసు ఉద్యోగుల సంక్షేమ సంఘం తరుపున రూ.50 వేలు నగదును అందజేశారు. సర్పంచ్ మడవి ప్రకాష్, ఆనంద్, విశ్వనాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ బంజారా దీక్ష భూమి సందర్శన

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి(హెచ్) గ్రామంలో జాతీయ బంజారా దీక్ష భూమిని సోమవారం గరీబ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోత్ జగన్ సందర్శించారు. దీక్ష గురువు సద్గురు ప్రేంసింగ్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. దీక్ష భూమి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు వసంత్‌రావు పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలి

నార్నూర్: అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని ఎస్సై మహేశ్ అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలోని కుండి, శేకుగూడ, అంద్‌గూడ, సావిరి, సాంగ్వి రోమన్‌కాసా, పావునూర్, తోయగూడ గ్రామాల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో అనుమానస్పందంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

'ఖానాపూర్‌ను 'సోనాపూర్'గా మారుస్తా'

ఉట్నూర్‌రూరల్: రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే ఖానాపూర్ సోనాపూర్‌గా (బంగారు నగరంగా) మారుస్తానని బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నమ్మకంతో అవకాశం ఇచ్చారని, మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యకర్త, నాయకులు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరితో కలిసి మెలిసి ముందుకెళ్దామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, ముజీబ్, ధరణి రాజేశ్ పాల్గొన్నారు.

కార్మికులకు మోటర్ సైకిళ్లు అందించాలి

ఎదులాపురం: కార్మికులకు మోటర్ సైకిళ్లు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ 2022 అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇస్తామని ప్రకటించగా.. నేటికీ అందించ లేదన్నారు. సంక్షేమ పథకాలను దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే వేలిముద్రలు పడక మీసేవ కేంద్రాలు, ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బొజ్జ ఆశన్న, దుమాల అశోక్, విఠల్, నరేశ్, శ్రీకాంత్, నరేశ్, భగవాన్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతు సాధికారిత ఉత్పత్తి దారుల సంస్థ లిమిటెడ్ డైరెక్టర్ జాజుల మురళి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 14 రైతు సాధికారత ఉత్పత్తి దారుల సంస్థ కేంద్రాలు ఉన్నాయన్నారు. అంకోలి గ్రామంలో ఒక కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు కూడా ఉన్నాయన్నారు. సమావేశంలో సర్పంచ్ భూమన్న, సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రాజేశ్వర్, సీఈవోలు అశోక్, అంజయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ పోడు పట్టాలివ్వాలి

ఉట్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లా వేమనపల్లి, నెన్నెల మండలాల్లోని గిరిజనులకు పోడు పట్టాలివ్వాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ అన్నారు. సోమవారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా మండలాల ఎంపీడీవోల నిర్లక్ష్యంతో పోడు భూములకు పట్టాలు రావడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సర్వే చేసి పట్టాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు బానోత్ రామారావు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.



పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదివాసీ స్థితిగతులపై అధ్యయనం



పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు



ఆదివాసీలతో సమావేశమైన అధికారులు

- గ్రామాల్లో పర్యటిస్తున్న ట్రెయినీ సివిల్ సర్వీస్ అధికారులు

సిరికొండ/గుడిహత్నూర్: ఆదివాసీ జీవన స్థితిగతులు, ఆచార వ్యవహారాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు ఏడుగురు ట్రెయినీ సివిల్ సర్వీస్ అధికారులు ఆదివారం రాత్రి మండలానికి చేరుకున్నారు. ఐటీడీఏ అధికారులు వీరికి మండలంలోని రిమ్మలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విడిది ఏర్పాటు చేశారు. సోమవారం రాజంపేట్, రిమ్మ గ్రామాల్లో పర్యటించి ఆదివాసీల జీవనోపాధి, ప్రధాన వృత్తి, ఆదాయ మార్గాలు, ఆహారం, విద్య, వైద్యం, ఉపాధి, ప్రభుత్వ పథకాలు, ఆదివాసీ చట్టాల గురించి అధ్యయనం చేస్తున్నారు. ఆయా గ్రామాల సర్పంచులతో చర్చించి వాస్తవాలు తెలు సుకుంటున్నారు. వారం రోజుల పాటు పర్యటించి ఆయా అంశాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆదివాసీల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు, ప్రకృతిని పూజించే విధానం బాగుందని ట్రెనీ ఐఏఎస్‌లు తెలిపారు. వీరి వెంట సిరికొండ ఎంపీడీవో సురేష్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, వ్యవసాయాధికారి దీపక్ ఉన్నారు.

ఇచ్చోడ: మండలంలోని మేడిగూడ గ్రామాన్ని సోమవారం ట్రెయినీ సివిల్ సర్వీస్ అధికారులు సందర్శించారు. స్థానిక అధికారులతో సమావేశమయ్యారు. వ్యవసాయ భూములు, ప్రధానంగా పండిస్తున్న పంటలు, అక్షరాస్యత, గ్రామ జనాభా, అటవీ భూములు, తాగునీరు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను ఎంపీడీవో రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మాడవి భీంరావు ఉన్నారు.

బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలి

నేరడిగొండ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీఆర్‌ఎస్ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ కోరారు. సోమవారం మండలంలోని రాజురా గ్రామంలోని కొండపై ఉన్న పురాతన శివాలయం, జగదాంబ దేవిని దర్శించుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సక్రియనాయక్ తండా (రాజురా) గ్రామంలోని హనుమాన్ మందిరంలో గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



అనిల్‌జాదవ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్సీ కవితను కలిసిన అనిల్ జాదవ్

నేరడిగొండ: నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ కలిశారు. ఆర్మూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బోథ్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శిఖర్ కైలాష్ టెక్డి శివాలయానికి వెళ్లేందుకు రోడ్డు మార్గం కోసం రూ. 12 కోట్లు మంజూరు చేసినందుకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు అటవీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, నేరడిగొండ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డిలు ఉన్నారు.

ఎమ్మెల్యే టికెట్ ఇంకా ఖరారు కాలేదు

- డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు ఎక్కడా కూడా ఖరారు కాలేదని, ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఖరారైందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. సోమవారం శాంతినగర్‌లోని మాజీ మంత్రి సీఆర్‌ఆర్ నివాసంలో మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. రైతు, యూత్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. నాయకులు అల్లూరి సంజీవ్ రెడ్డి, సాయి చరణ్ గౌడ్, అంబకంటి అశోక్, నగేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

గ్రామాల రూపు రేఖలు మారుస్తాం..

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వెంటనే మారుమూల గ్రామాల రూపురేఖలు మారుస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని గౌరపూర్, సాలేగూడ, చిత్తబట్ట, మోహన్‌గూడ గ్రామాల్లో పర్యటించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు జహీర్, జితేందర్, మానిక్‌రావ్, భగవాన్, బాబాసాహెబ్ పాల్గొన్నారు.

'జోగు రామన్న ఓటమే లక్ష్యంగా పని చేయాలి'

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఓటమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకొని సోమవారం ఆదిలాబాద్‌కు వచ్చినా ఆయనకు మావల సమీపంలోని జాతీయ రహదారి 44 వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి బైక్ ర్యాలీగా పట్టణంలోని ప్రజాసేవా భవన్‌కు చేరుకున్నారు. రానున్న ఎన్నికల్లో ఆదిలాబాద్ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరడంతో పాటు రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



కంది శ్రీనివాస రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కంది శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరేసేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు.

'హామీలు నెరవేర్చడంలో విఫలం'

ఆదిలాబాద్: సీఎం కేసీఆర్ హామీల అమలులో విఫమయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ సేవాదళం నాయకులు, బేల, జైనథ్ మండలానికి చెందిన ఆదివాసీలు బీజేపీలో చేరారు. వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులను సీఎం కేసీఆర్ మోసం చేశారని ఉద్యమ ద్రోహులకు పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించి పట్టణంలోని కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మడావి రేవంత్, తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుహాసినిరెడ్డి

లెక్చరర్ల కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సంజీవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గాజుల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా బాలాజీ, సహా అధ్యక్షుడిగా ప్రేమ్‌చందర్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సూర్యకాంత్, కోశాధికారిగా దేవేందర్, ఉపాధ్యక్షుడిగా వినోద్, హరి, శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రత్నాకర్, నాందేవ్, శ్రీనివాస్, సంతోష్, సంతోష్, వినోద్ కుమార్, మహిళ కార్యదర్శులుగా రామాంజని, వనజ, ముజఫర్ రహెమాన్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

రెగ్యులర్ చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: ఇతర శాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసినట్లే తమను కూడా రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ న్యాయ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్ని విద్యార్హతలు ఉన్న సమగ్ర శిక్షాలోని ఉద్యోగుల పట్ల ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు అనురాధ, సీహెచ్ దీప్తి, ప్రశాంత్ రెడ్డి, పడాల రవీందర్ పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిని నియమించాలి

తాంసి: మండలంలోని గోట్కూరి ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిని వేరే మండలానికి డిప్యూటేషన్ పంపించడం జరిగింది. అప్పటి నుంచి ఇంగ్లిష్ టీచర్ లేక విద్యార్థులు చదువులో వెనుకబడ్డారని అన్నారు. గ్రామపెద్దలు చిలుక దేవిదాస్, దత్తు, అనుప్ పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

ఆదిలాబాద్‌టౌన్: జాబిల్లిపై చంద్రయాన్–3 అడుగుపెట్టిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సోమవారం విద్యార్థులు సంబురాలు జరుపుకున్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ శాస్త్రవేత్తలకు ఉత్తరాలు పంపారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషికి ఫలితం దక్కిందని, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవి, ప్రిన్సిపాల్ శ్వేత, వైస్ ప్రిన్సిపాల్ మహమ్మద్ వసీం పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాలు పంపిణీ

తాంసి: భీంపూర్ మండలంలోని లబ్ధిదారులకు ఐటీడీఏ ద్వారా రాయితీపై మంజూరైన ట్రైకార్ రుణాలను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని బెల్సరీరాంపూర్, మార్కగూడ గ్రామాలకు చెందిన నాలుగురు లబ్ధిదారులకు ఐటీడీఏ తరపున మంజూరైన ఎడ్ల జతలు, మేకల యూనిట్లు మంజూరయ్యాయి. రూ.1.50 లక్షల విలువ గల యూనిట్లను ఆయా గ్రామాల్లో మండల పశువైద్యాధికారి సుభాష్ రాథోడ్, బ్యాంకు అధికారి స్వామి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, లింబాజీ పాల్గొన్నారు.

'పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలను అతిక్రమిస్తున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాంనగర్ జాతీయ రహదారి పక్కనున్న ఉన్న ప్రైవేట్ పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. అంతకు ముందు కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, నాయకులు దత్తు, గంభీర్, దిలీప్, వెంకటేశ్, సురేశ్, సలీమ్, వరుణ్ పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా క్రీడల్లో రాణించాలి

ఆదిలాబాద్: క్రీడాకారులు హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని రాణించాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రతిష్ఠించనున్న ధ్యాన్ చంద్ విగ్రహ ఏర్పాట్ల పనులను సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యాన్ చంద్ భారతదేశ క్రీడారంగంలో ఆయన కీర్తి అజరామరమన్నారు. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట బైఠాయించిన ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: పోడు భూముల సర్వే చేపట్టి పట్టాలు ఇచ్చే వరకు కదిలేది లేదని ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివాసీలు బైఠాయించారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం చిత్తాపూర్, కృష్ణ పెల్లి, కోసంపెల్లికి చెందిన ఆదివాసీలు ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం రాత్రి వరకు బైఠాయించి పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.